క్లుప్తంగా

నేడు సీతారాముల కల్యాణం

చిట్టమూరు: మండలంలోని మల్లాంలో ఉన్న రామసాయి మందిరంలో గురువారం సీతారాముల కల్యాణోత్సవం జరుగుతుందని నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం స్వామివారి కల్యాణం ప్రారంభమవుతుందన్నారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తామన్నారు. ఈ నెల 31వ తేదీ శ్రీరామ పట్టాభిషేకం, ఏప్రిల్ ఒకటో తేదీ వసంతోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. ఏకాంత సేవతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు.

సద్వినియోగం చేసుకోండి

గూడూరు: ఇంటి, కొళాయి, ఖాళీ స్థలాల పన్నులను ఈ నెలాఖరులోపు చెల్లించి, వడ్డీ రాయితీని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సాయినాథ్ పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మున్సిపాలిటీలో కొందరు చాలా ఏళ్లుగా పన్నులు చెల్లించలేదన్నారు. అలాంటి వారు ఈ నెల 31వ తేదీ లోగా చెల్లించి, రాయితీని పొందాలన్నారు.

సీఎం జగన్‌కు కృతజ్ఞతలు

నాయుడుపేట: దళిత క్రైస్తవులను ఎస్సీ కులం జాబితాలో చేర్చడంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు కాళహస్తి భావన్ అనుదీ అన్నారు. నాయుడుపేట ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దళితులు, మైనారిటీల పక్షపాతిగానే కాకుండా అన్ని వర్గాలకు అండగా ఉండడంలో సీఎంకు ఎవరూ సాటిలేరని చెప్పారు. మాజీ కౌన్సిలర్ వరకళాచంద్ పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణం



పూజలు చేస్తున్న అర్చకులు

చిల్లకూరు: తమ్మిన పట్నంలోని కోదండ రామస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ధ్వజారోహణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. తొలుత ధ్వజస్తంభం వద్ద పూజలు చేసి, ధ్వజపటాన్ని ఎగురవేశారు. భక్తులు స్వామి అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమాలను ఆలయ చైర్‌పర్సన్ యరటపల్లి సాయి పృద్వీరెడ్డి, ఈఓ కోవూరు జనార్దనరెడ్డి పర్యవేక్షించారు.

త్వరలో పట్టాల పంపిణీ

చిట్టమూరు: మండలంలోని రైతులకు త్వరలో జగనన్న భూ హక్కు, భూరక్ష పథకం కింద పట్టాలు పంపిణీ చేయనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని ఉప్పలమర్తి పంచాయతీ జంగాలపల్లెలో బుధవారం భూ రీ సర్వేపై గ్రామసభ నిర్వహించారు. మండలంలో రాష్ట్ర ప్రభుత్వ చేపట్టిన రీ సర్వేను పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సర్పంచ్ నాగముంతల లావణ్య, రీ సర్వే డీటీ నిరంజన్ పాల్గొన్నారు.

వేలం పాటలు వాయిదా

గూడూరు: మున్సిపల్ కూరగాయల మార్కెట్ వేలం పాటను వాయిదా వేసినట్లు మున్సిపల్ కమిషనర్ సాయినాథ్ పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం కూరగాయల మార్కెట్‌కు సంబంధించిన వేలం పాట నిర్వహించారు. ఈ పాటల్లో పాల్గొన్న వారు రూ.17.72 లక్షల వరకు వేలం పాట పాడారు. ఈ మొత్తం గత ఏడాది మొత్తం రూ.25.15 లక్షలతో పోల్చితే తక్కువగా ఉండడంతో వేలం పాట వాయిదా వేశామని తెలిపారు.

చేపల చెరువు వేలం..

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): కడగుంట చేపల చెరువు వేలం పాట వాయిదా వేసినట్లు ఎంపీడీఓ స్వరూపరాణి తెలిపారు. ఆమె మాట్లాడుతూ బుధవారం గ్రామంలో నిర్వహించిన చేపల చెరువు వేలం పాటలో డిపాజిట్ చెల్లించేందుకు ఎవరూ ముందుకు రాక వేలం పాట వాయిదా వేశామన్నారు. వేలం తేదీ ఎప్పుడనే విషయం త్వరలో ఖరారు చేస్తామన్నారు. ఈఓపీఆర్డీ మోహన్‌రాజు, కార్యదర్శి హరికృష్ణకుమార్, సర్పంచ్ ఒప్పుతొట్టి అంకయ్య, నేతలు గంగాదేవి సురేష్ పాల్గొన్నారు.

వాన పాములు వదలండి

చిల్లకూరు: చెత్త సంపద తయారీ కేంద్రాల్లో వానపాములను వదలి చెత్తను ఎరువుగా మార్పు చేసి పంచాయతీకి ఆదాయం సమకూర్చాలని ఈఓపీఆర్డీ మాణిక్యం సూచించారు. మండలంలోని వేళ్లపాళెం, తూర్పుకనుపూరు, బల్లవోలు, తిక్కవరం, కలవకొండ, గ్రామాలలో చెత్త సంపద తయారీ కేంద్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, సాయిరామమ్మ, రమణయ్య తదితరులు ఉన్నారు.

పట్టాలు మంజూరు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

ఓజిలి: ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు మంజూరు చేయాలని ఆర్మేనిపాడు దళితులు తహసీల్దార్ లాజరస్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ సర్వేనంబర్ 73–పీలో 22 మంది రైతులు 44 ఎకరాలు భూమిని 20ఏళ్లుగా సాగు చేస్తున్నామన్నారు. భూ పంపిణీలో పట్టాలు మంజూరు చేస్తే బ్యాంకులు ద్వారా రుణాలు పొంది జీవనోపాధిని పొందుతామని తెలిపారు. స్పందించిన తహసీల్దార్ భూములు సర్వే చేయించి, పట్టాలు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు రవి పాల్గొన్నారు.

అతివల ఆర్థికాభివృద్ధికి ఆసరా



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి



మహిళలకు ఆసరా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య

సూళ్లూరుపేట రూరల్: రాష్ట్రంలో మహిళా సాధికారతే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పని చేస్తున్నారని, ఈ క్రమంలోనే అతివల ఆర్థికాభివృద్ధికి ఆసరా పథకం అమలు చేశారని టీటీడీ బోర్డు సభ్యులు, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య అన్నారు. మండలంలోని కోటపోలూరులో బుధవారం వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కులను పంపిణీ చేశారు. తొలుత ఎమ్మెల్యే కిలివేటి స్థానిక నాయకులతో కలసి కోటపోలూరు క్రాస్ రోడ్డు నుంచి భారీ మోటారు సైకిల్ ర్యాలీ చేశారు. అనంతరం గ్రామంలో ఉన్న దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతిపక్ష నేత చంద్రబాబు పొదుపు సంఘాల సభ్యులను మోసపూరిత మాటలతో మభ్యపెట్టారని ఆరోపించారు. పాదయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల కష్టాలు తెలుసుకుని సీఎం అయిన వెంటనే మహిళలకు ఆసరా పథకం అమలు చేసి, అండగా నిలిచారన్నారు. జగనన్న చెప్పిందే చేస్తారన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో నూటికి 98 శాతం నేరవేర్చిన ఘనత మన సీఎంకు దక్కిందన్నారు. అనంతరం మహిళలు సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు.

వందో రోజు..గడప గడపకు మన ప్రభుత్వం

సూళ్లూరుపేట నియోజకవర్గంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టి వంద రోజులు పూర్తి అయిన సందర్భంగా భారీ మోటార్‌సైకిల్ ర్యాలీ చేశారు. ఎమ్మెల్యే స్వయంగా మోటార్‌సైకిల్ నడిపారు. ఇంటింటికీ వెళ్లి బుక్‌లెట్లను అందజేసి లబ్ధిదారులకు వారు పొందిన లబ్ధిని వివరించారు. వచ్చే ఎన్నికల్లో కూడా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ చంద్రముని, ఎంపీపీ అల్లూరు అనిల్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం



జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తదితరులు

– నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరిరూరల్(బాలాయపల్లి): మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మహిళలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయ ప్రాంగణంలో బుధవారం ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రామ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ బాలాయపల్లి మండలంలోని 5,450 పొదుపు సంఘాలకు రూ.3.85 కోట్ల నిధులు మహిళల ఖాతాల్లో జమ చేశారన్నారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అంతకు ముందు పొదుపు మహిళలు ఏర్పాటు చేసిన మిల్లెట్స్ స్టాళ్లను పరిశీలించారు.

మంత్రి పదవి ఇవ్వలేదనే విమర్శలు

మంత్రి పదవి ఇవ్వలేదన్న అక్కసుతోనే ఆనం రామనారాయణరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారని రామ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడడంతోనే ఆయన్ని పార్టీ నుంచి బహిష్కరించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గూడూరు భాస్కర్‌రెడ్డి, వెంకటగిరి ఏఎంసీ చైర్మన్ సింగంశెట్టి భాస్కర్‌రావు, జయంపు పీఏసీఎస్ అధ్యక్షుడు వెందోటి కార్తీక్‌రెడ్డి, పార్టీ ప్రచార విభాగం తిరుపతి జిల్లా అధ్యక్షుడు నెమళ్లపూడి సురేష్‌రెడ్డి, వైస్ ఎంపీపీలు బట్టేపాటి మురళీమోహన్‌రెడ్డి, వాన పార్వతి, సర్పంచ్‌లు మల్లెమాల గోపి కృష్ణారెడ్డి, వెందోటి సుప్రజ, చప్పిడి గాయత్రి, యల్లంటి కృష్ణయ్య, కాంతమ్మ, ఎంపీటీసీ సభ్యులు వేళ్ల సురేంద్ర, కే మాధవి, నాయకులు అన్నంగి సుబ్బరాయులు, తోట గణేష్‌రెడ్డి, పేచీరాజ్, దేవికచౌదరి, అల్లంరాజ, బాబిచౌదరి పాల్గొన్నారు.

విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యం



చిన్నారుల నృత్య ప్రదర్శన

గూడూరురూరల్: విద్యతోనే సమాజంలో మార్పు సాధ్యమని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క అన్నారు. గూడూరు రూరల్ పరిధిలోని గోగినేనిపురం వద్ద ఉన్న ఆదిశంకర పాఠశాల 13వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన విమలక్క మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అందించడం ద్వారా విద్యార్థులు సమాజంలో ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని తెలిపారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం పలు పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయుడు పాశం యాదగిరి, విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎ.మోహన్, ఏఓ రామయ్య, పాఠశాల ప్రిన్సిపల్ రూపవతి, తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబైన ఆలయాలు

నాయుడుపేటటౌన్: శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని పలు ఆలయాలను అందంగా ముస్తాబు చేస్తున్నారు. గురువారం స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పలు ఆలయాలు విద్యుత్ దీపాలంకరణలతో అలంకరించారు.

సైదాపురంలో

సైదాపురం: మండలంలోని అన్నీ దేవాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. విద్యుద్దీపాలతో అలంకరించారు. అవాంఛనీయమైన సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్‌ఐ నాగబాబు తెలిపారు.

సుఖసంతోషాలతో జీవించాలి

వెంకటగిరి: సీతారాముల ఆశీస్సులతో జిల్లా వాసులు సుఖసంతోషాలతో జీవించాలని వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి ఆకాంక్షించారు. బుధవారం ఆయన జిల్లా ప్రజలకు శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలిపారు. ధర్మాన్ని కాపాడేందుకు జీవితాన్నే త్యాగం చేసిన మహోన్నత ప్రజాపాలకుడు శ్రీరాముడు అని, లోక కల్యాణం కోసం త్యాగాల కోర్చిన సీతారాముల పవిత్రబంధం అజరామమైందన్నారు.

రీ సర్వే ప్రారంభం

నాయుడుపేటటౌన్: వైఎస్సార్, జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్షణ పథకానికి సంబంధించి మున్సిపాలిటీలో రీసర్వేని బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక మాట్లాడుతూ రీసర్వేకు పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు. కమిషనర్ ఐ శ్రీనివాసరావు, మేనేజర్ ఎంకే ఖాజామొహిద్దీన్, టీపీఓ నాగవల్లి, కౌన్సిలర్లు దారా రవి, పాపాడి చంద్రారెడ్డి, పీ నాగార్జున, షేక్ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్టీ కమిషన్ సభ్యుడి రాక

వెంకటగిరిరూరల్: ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర సభ్యుడు వడిత్యా సోమశంకర్ నాయక్ గురువారం వెంకటగిరి రూరల్ మండలంలో పర్యటించనున్నట్లు యానాదుల గిరిజన సంక్షేమ సంఘం తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడు తలపల చెంచు మల్లికార్జున్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటగిరి రూరల్ మండలంలోని సోమసానిగుంట, ధర్మచాట్లవారి కండ్రిగ గిరిజన కాలనీలను సందర్శించనున్నట్లు తెలిపారు.

ఘర్షణ.. ఇద్దరికి గాయాలు

నాయుడుపేటటౌన్: మండలంలోని అత్తిమిట్ట గ్రామం వద్ద బావ, బావమరుదులు అప్పు విషయమై బుధవారం గొడవపడ్డారు. గొడవ పెద్దదై ఒకరిపై ఒకరు దాడి చేసుకుని గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. అత్తిమిట్టకు చెందిన వెంకటముని తన బావమరిది చెంగయ్యకు రూ.70 వేలు అప్పు ఇచ్చాడు. ఆ నగదు తిరిగి ఇవ్వమని అడిగాడు. దీంతో ఇద్దరి మధ్య మాటామాట పెరిగి, ఘర్షణ పడ్డారు. గొడవ మరింత ముదరడంతో ఒకరిపై మరొకరు దాడి చేసుకుని, ఇద్దరు గాయపడ్డారు. ఈ విషయమై ఇరువర్గాల వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించి, ఈ ఘటనపై పోలీసులు విచారణ జరుపుతున్నారు.

రోజూ 4 గంటలు పని చేయాలి



పనులను పరిశీలిస్తున్న ఈసీ దామోదర్‌రాజు

దక్కిలి: ఉపాధిహామీ కూలీలు రోజుకు 4 గంటలకు తగ్గకుండా పని చేయాలని ఈసీ దామోదర్‌రాజు తెలిపారు. మండలంలోని దగ్గవోలులో జరుగుతున్న ఉపాధిహామీ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే నెల ఒకటో తేదీ నుంచి పనులకు వచ్చే కూలీలకు ప్రభుత్వం రోజుకు రూ.272 కూలీ ఇస్తుందన్నారు. ఆయన వెంట ఐబీ డీఆర్పీ రాఘవేంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్ కోటేశ్వరరావు ఉన్నారు.

స్వచ్ఛాంధ్రకు ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేస్తున్న శానిటేషన్ సిబ్బంది, వలంటీర్లు

గూడూరు: స్వచ్ఛాంధ్రప్రదేశ్ సాధనకు అందరూ తమ వంతు సహకరించాలని శానిటేషన్ కార్యదర్శులు కోరారు. పట్టణంలోని 8, 9 సచివాలయాల్లో బుధవారం శానిటేషన్ కార్యదర్శులు, వలంటీర్లు శుభ్రత పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

ఆర్థిక సాయం

గూడూరు: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతూ ఆర్థిక ఇబ్బందులు పడుతున్న వ్యక్తిని ఆదుకునేందుకు ప్రగతి సేవా సంస్థ అధ్యక్షుడు కే చంద్రశేఖర్ బాధితుడి కుటుంబ సభ్యులకు బుధవారం రూ.20 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో కే శ్రీనివాసులు, పీడీ కరీముల్లా, ప్రభాకర్, రాము, కుమార్, కృష్ణ, రమేష్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు నలుగురి ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

తడ: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్‌నకు తమ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారని చిన్నమాంబట్టు జెడ్పీ హైస్కూలు హెచ్‌ఎం ఫణివేణి తెలిపారు. ఎనిమిదో తరగతి చదువుతున్న కామిరెడ్డి కార్తీక్‌రెడ్డి, మన్నే శ్రావ్య, నల్లపాటి వర్షిత, కొల్లి పెంచల్‌రెడ్డి ఎంపికయ్యారన్నారు. వీరిని పాఠశాలలో బుధవారం హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

వలంటీర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

పెళ్లకూరు: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ సురేష్‌బాబు ఆధ్వర్యంలో వలంటీర్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించారు. నెలబల్లికి ఇద్దరు, పునబాక ఒకరు మొత్తం మూడు పోస్టులకు మొత్తం 15 మంది హాజరయ్యారు. ఇంటర్వ్యూల అనంతరం ఎంపిక జాబితాను త్వరలో వెల్లడిస్తామని ఎంపీడీఓ పేర్కొన్నారు.

వాకాడులో..

వాకాడు: మండలంలో ఖాళీగా ఉన్న వలంటీర్ల పోస్టుల భర్తీకి బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ గోపీనాథ్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. వాలమేడు, పూడిరాయిదొరువు, బాలిరెడ్డిపాళెం పంచాయతీల్లో మూడు పోస్టులకు ఐదుగురు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. అర్హత ఉన్న ముగ్గురిని ఎంపిక చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని జాతీయ రహదారి కూడలి వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నాయుడుపేట పట్టణానికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తికి గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని రాజగోపాలపురం 5వ వీధిలో ఉన్న ఇటుకల వ్యాపారి మేడేపల్లి ప్రసాద్ తన బైక్‌పై స్థానిక ఎస్‌కేఎల్‌ఎస్ పెట్రోలు బంకు వద్దకు బయలుదేరాడు. రోడ్డు దాటుతుండగా చెన్నై వైపు వెళుతున్న కారు అతని బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన ప్రసాద్‌ను చెన్నైలోని వైద్యశాలకు తరలించారు. బాధితుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దుస్తుల అందజేత

చిల్లకూరు: స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పేద గిరిజనులకు ఒక్కొక్కరికి రెండు జతల దుస్తులను బుధవారం అందజేశారు. మండలంలోని నెలబల్లిరెట్టపల్లి గిరిజన కాలనీలోని 25 కుటుంబాల వారికి నిత్యావసర వస్తువులతో పాటుగా ఒక్కొక్కరికి రెండు జతల దుస్తులను పీపుల్స్ వెల్ఫేర్ అండ్ చైల్డ్ ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. సంస్థ అధ్యక్షులు పోతుగుంట మల్లికార్జున్, మస్తానయ్య, అరుణ్‌బాబు, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

గాయపడిన వృద్ధురాలి మృతి

తడ: అగ్ని ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఎస్‌ఐ కథనం మేరకు.. మండలంలోని వెంకటాద్రిపాళేనికి చెందిన శాంద మరమ్మ(75) అనారోగ్యంతో రెండేళ్లగా మంచానికి పరిమితమైంది. ఆమె నివాసం ఉంటున్న గుడిసెకు షార్ట్ సర్క్యూట్‌తో నిప్పంటుకుని, అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన వృద్ధురాలు చెన్నైలో చికిత్స పొందుతూ మృతి చెందింది. శవ పంచనామా చేసి, మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఎస్‌ఐ కేపీ శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

మహిళల ఆశాకిరణం సీఎం జగన్



మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

– ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు



కోట: సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు

చిల్లకూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి మహిళల ఆర్థిక స్థితిగతులను మార్చి, వారి పాలిట ఆశాకిరణంగా నిలిచారని ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్‌రావు అన్నారు. చిల్లకూరులోని క్రాంతి పథం కార్యాలయ ఆవరణలో బుధవారం మండలంలోని పొదుపు మహిళలకు ఆసరా చెక్కులను పంపిణీ చేశారు. తొలుత పొదుపు మహిళలు తాము తీసుకున్న రుణాలతో తయారు చేస్తున్న ఉత్పత్తుల ప్రదర్శనను తిలకించి, చిరుధాన్యాలతో చేసిన తినుబండారాలను రుచి చూశారు. ఆయన మాట్లాడుతూ గూడూరు నియోజకవర్గంలోని గూడూరు చిల్లకూరు, వాకాడు, కోట, చిట్టమూరు మండలాల్లో 33,961 మంది డ్వాక్రా గ్రూపు సభ్యులకు రూ.24,03,93,995ను చెక్కుల రూపంలో అందిస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల్లో ఎవరినైనా మోసం చేయగల దిట్ట చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. గత ఎన్నికల సమయంలో 600కు పైగా హామీలిచ్చి ఒక్కటీ నెరవేర్చలేని సీఎంగా చంద్రబాబు చరిత్రలో నిలిచిపోయారని దుయ్యబట్టారు. అయితే ఇచ్చిన మాటను నిలబెట్టుకునే సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని తెలిపారు. అనంతరం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పొదుపు మహిళలతో కలసి పాలాభిషేకం చేశారు. తరువాత చెక్కు నమూన అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ ఓడూరు యమునమ్మ, జెడ్పీటీసీ సభ్యులు మన్నెం శీనయ్య, వైస్ ఎంపీపీ పొలుబోయిన చెంగయ్య, ఎంపీటీసీ సభ్యులు ఎల్లసిరి జానకిరాం, దారా కోటేశ్వరరావు, ఏఎంసీ డైరెక్టర్ సందానీబాషా, కమ్మవారిపాళెం సర్పంచ్ చిట్టేటి నారాయణ, నాయకులు అనుదీప్, ఏపీఎం గుణయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే లక్ష్యం

కోట: మహిళా సాధికారతే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. కోట మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం జరిగిన పొదుపు సంఘాలకు వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదవాడి ఆకలి తెలిసిన వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. పేద బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కష్టపడి పనిచేస్తున్నారన్నారు. అనంతరం పొదుపు సంఘాల సభ్యులు ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఎమ్మెల్యే చేతుల మీదుగా మండలంలోని 682 సంఘాల్లోని 6,748 మందికి రూ.5.36 కోట్లను పంపిణీ చేశారు. నాయకులు నరమాల వెంకటరమణయ్య, మొబీన్‌బాషా, సన్నారెడ్డి చెంచురాఘవరెడ్డి, గురుస్వామి, ప్రసాద్, సుధారెడ్డి పాల్గొన్నారు.

శుభ్రతకు స్వచ్ఛ సంకల్పమే ముద్దు



మాట్లాడుతున్న డీఎల్‌పీఓ వెంకటరమణ

నాయుడుపేట: పంచాయతీల పరిశుభ్రతకు స్వచ్ఛ సంకల్పమే ముద్దని డీఎల్‌పీఓ వెంకటరమణ అన్నారు. నాయుడుపేట మండలంలోని మేనకూరులో బుధవారం జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా శిక్షణ శిబిరంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. గ్రామాల్లో చెత్త నిల్వలు లేకుండా వేరు చేసి సంపదను తయారు చేయడంలో మేనకూరు ముందంజలో ఉందన్నారు. రాష్ట్ర ట్రేడ్ యూనియన్ కార్యదర్శి కట్టా వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ జగన్నన్న స్వచ్ఛ సంకల్పం అమలుకు పంచాయతీలో శిక్షణ ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. డీఆర్పీలు జీ వెంకటరావు, కే వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

పక్షుల కేంద్రంలో నేచర్ క్యాంపు



బహుమతి అందజేస్తున్న డీఎఫ్‌ఓ శామ్యూల్

దొరవారిసత్రం: నేలపట్టు పక్షుల రక్షిత కేంద్రంలో బుధవారం స్థానిక వన్యప్రాణి విభాగం అధికారులు పూలతోట జెడ్పీ హైస్కూలు విద్యార్థులకు నేచర్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన సూళ్లూరుపేట సబ్ డివిజన్ డీఎఫ్‌ఓ శామ్యూల్ ప్రకృతిలో పక్షుల ప్రాధాన్యత, అడువులతో లాభాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే నేలపట్టు, పులికాట్ వంటి పక్షుల కేంద్రాల గురించి ఆయన తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. రేంజర్ ఆఫీసర్ వరప్రసాద్, హెచ్‌ఎం కృష్ణయ్య పాల్గొన్నారు.

‘ఆనం’ వెంకటగిరి నుంచే పోటీ చేయాలి



మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వెంకటగిరి: ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డికి ఏపార్టీ సిద్ధాంతం నచ్చుతుందో.. ఆ పార్టీ తరుపున వెంకటగిరిలో మళ్లీ పోటీ చేస్తే నియోజకవర్గ ప్రజలు ఆత్మ ప్రభోదానుసారం తగిన గుణపాఠం చెబుతారని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో ఆనం వెంకటగిరి నియోజకవర్గం నుంచే పోటీ చేయాలని ఆహ్వానిస్తున్నామని, ఆయన కూడా దీన్ని సవాల్ స్వీకరించాలన్నారు. ఆయన అన్యాయాలు, అక్రమాలకు బలైనవారు ఇదే కోరుకుంటున్నారన్నారు. వెంకటగిరి నియోజకవర్గంలో భూ పంపిణీకి సంబంధించి అధికారులు చర్యలు తీసుకుంటున్నారన్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం ఓ బృహత్తర కార్యక్రమమని, ప్రభుత్వం చేసిన మంచి పనులను వివరించడంతో పాటు సమస్యల పరిష్కార వేదికగా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వెంకటగిరి నియోజకవర్గ ప్రజలకు అండగా, అందుబాటులో ఉంటూ సీఎం జగన్ మోహన్‌రెడ్డి తనపై ఉంచిన బాధ్యతను శక్తివంచన లేకుండా నెరవేర్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. వెంకటగిరి పట్టణాన్ని అన్నిరంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దేలా ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. జగనన్న లేఅవుట్‌లో భూమి ఇచ్చిన టైలర్స్, భవన నిర్మాణ కార్మికులకు తగిన న్యాయం చేస్తామన్నారు. అనంతరం మున్సిపల్ కౌన్సిలర్లతో సమావేశమై పట్టణాభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు.

ప్రకృతి సేద్యంతో అధిక దిగుబడి



జిగురు అట్టలు పంపిణీ చేస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

వెంకటగిరి రూరల్: రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారిస్తే నాణ్యమైన పంటతోపాటు అధిక దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి గోవిందరాజులు పేర్కొన్నారు. స్థానిక కేవీకేలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు జిగురు అట్టలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ తిరుపాల్, విజయశ్రీ, నాగార్జునరెడ్డి, రాజీవన పాల్గొన్నారు.


ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు

గూడూరు: ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారంతో ప్రశాంతంగా ముగిశాయని ఎస్పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణాధికారి(ఆర్‌ఐఓ), పరీక్షల కన్వీనర్ టీ వరప్రసాద్‌రావు పేర్కొన్నారు. పట్టణంలోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌లో చివరి రోజు పరీక్షల జవాబు పత్రాలను ఆర్‌ఐఓ పర్యవేక్షణలో ఆయన తీసుకున్నారు. ఆయన వెంట ఎస్‌కేఆర్ ప్రభుత్వ కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ ఎన్ కోటేశ్వరరావు, డిపార్ట్‌మెంట్ అధికారి జీ సాయికిరణ్, తదితరులున్నారు. కాగా పరీక్షలు ముగియడంతో విద్యార్థులు తమ స్నేహితులతో కలసి సందడి చేశారు.

ముగిసిన పరీక్షలు ..

నాయుడుపేట: నాయుడుపేటలో ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం నాటికి ముగిశాయి. స్థానిక అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాల, నాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల, శ్రీవేమ జూనియర్ కళాశాలలైన మూడు కేంద్రాల్లో విద్యార్థులు పరీక్షలు రాశారు. ఈసందర్భంగా ప్రిన్సిపల్ మల్లికార్జున్ రావు మాట్లాడుతూ బాలుర గురుకులంలో విద్యార్థులకు ముగింపు రోజున ఎండ వేడిమి అధికంగా ఉండడంతో శీతల పానీయాలు, మజ్జిగను అందించామన్నారు.

పోలేరమ్మ హుండీ ఆదాయం రూ.12.21 లక్షలు



హుండీ లెక్కిస్తున్న సిబ్బంది

వెంకటగిరి: పాతకోట రామమందిరం ఆవరణలో పోలేరమ్మ ఆలయం హుండీ లెక్కింపు కార్యక్రమం బుధవారం నిర్వహించారు. హుండీ ద్వారా ఆలయానికి రూ.12,21,907 ఆదాయం వచ్చిందని ఈఓ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆ నగదుతోపాటు 8 గ్రాముల బంగారం, 157 గ్రాముల వెండి, చైనా 10 యువాన్‌లు 3, కువైట్ అరదినార్ 1, పావుదినార్ 1, శ్రీలంక 20 రూ.1 హుండీలో వచ్చాయన్నారు. హుండీ ద్వారా వచ్చిన మొత్తాన్ని బ్యాంక్‌లో జమ చేశామని ఆయన తెలిపారు.